కథ

# "సరళా! ఇంకా నా దగ్గర కొత్తేనా" పెళ్ళై పదిరోజులైనా ముభావంగా వున్న భార్యనడిగాడు స్వరూప్.

**అతడంత చనువుగా ప్రవర్తించడంతో ఈ పది రోజుల్లో చాలావరకు బెరుకు తగ్గి కొత్త ఇంటి వాతావరణానికి అలవాటుపడింది సరళ. కానీ తన మనసులో మాత్రం ఎంత సముదాయించుకుందామన్నా సముదాయించుకోలేని విషయం ఒకటుంది. అలాగని ఆ విషయం బయటపెట్ట లేదు. స్వరూప్ చనువువల్ల దాచుకోనూ లేదు.**

## నా కోరిక తృప్తి

స్వరూప్ కూడా ఆమె నిర్లిప్తతకి కారణం తెలుసుకోలేకపోతున్నాడు అందుకే లాలనగా అడిగాడు.

ఆమె మనసులో మాట చెబితే ఏమనుకుంటాడోనని మొదట చెప్పడానికి ధైర్యం చాలక పోయినా, అతడి సాన్నిహిత్యం, స్నేహ తత్త్వం ఆమెని నోరు మెదిపేటట్టు చేసాయి.

''ఏమండీ! మీరేమీ అనుకోనంటే ఒక మాట చెబుతాను'' అంది ఉపోద్ఘాతంగా.

ఆ మాటకి స్వరూప్ ''చూడు సరళా! భార్యాభర్తలంటే స్నేహితుల్లా వుండాలనేది నా తత్త్వం. నువ్వు నన్ను భర్తగాకాక, స్నేహితుడిగా భావిస్తావని ఆశిస్తాను'' అన్నాడు.

దాంతో ధైర్యం వచ్చిన సరళ ''ఏమండీ నాకు చదువుకున్న వాళ్ళంటే ఇష్టం. నాకూ చదువుకోవాలని ఆశ. కానీ ఇంటి పరిస్థితుల వల్ల అది సాగలేదు. అందుకే...'' అర్థోక్తిగా ఆపేసింది. కానీ ఆ మాట యొక్క పూర్తి పాఠం అతడికి తెలుసు అందుకే అన్నాడు.

''ఓస్.. అంతేకదా? ఇంకా నా స్థాయికి మించినదేదో అడుగుతావనుకున్నాను. నీకు ఇంట్రెస్ట్ వుంటే అదెంతపని. అన్నట్టు నీ ఇంటర్ సర్టిఫికేట్ వుందా?'' అడిగాడు.

''అమ్మా వాళ్ళింట్లో వుంది'' సరళ సమాధానం.

''ఈసారి వెళ్ళినపుడు తీసుకురా!'' స్వరూప్ సూచన.

ఆ తర్వాత అన్నీ త్వరత్వరగా జరిగిపోయాయి. డిగ్రీకి ఎగ్జాంషన్ తెప్పించాడు. పరీక్ష ఫీజు కట్టాడు. ఆమెకు కావాల్సిన అన్ని రకాల నోట్సులు, పుస్తకాలు తెచ్చాడు. దగ్గర కూర్చుని చదివించాడు. డౌట్సు వుంటే తీర్చాడు. తనకి కూడా తెలియని విషయాలుంటే సంబంధిత వ్యక్తుల దగ్గరకు ప్రైవేట్‌కి పంపించాడు. ఇలా అదీ ఇదీ అనికాక ఆమెకు ఒక చక్కని గైడ్‌గా మారాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆమె కంటే అతడే చాలా కష్టపడ్డాడు. ఒకపక్క పని ఒత్తిడి వున్న ఉద్యోగం చేస్తూనే ఆమెకి, ఆమె చదువుకి అన్ని రకాల చక్కగా సహకరించాడు. అతడి సహాయ సహకారాలతో సరళ డిగ్రీకి స్వంతదారైంది మంచి మార్కులతో. స్వరూప్ చాలా సంతోషించాడు. భార్య కోరిక తీర్చిన తృప్తి అతడి కళ్ళలో కదలాడుతోంది. కానీ అతడి తృప్తిలో సగమైనా అతడిలో సగమైన భార్య కళ్ళలో చూడలేకపోయాడు. కారణం ఊహించాడు. ఆమె విద్యాతృష్ణ ఇంకా తీరలేదనేది ఆ ఊహ సారాంశం.

''ఏం చేయాలి?'' అతడి మస్తిష్కంలో ప్రశ్న.

''ఇంకా పై చదువులు చదివించాలి'' అతడి మనసుకు మనసే చెప్పిన సమాధానం. అతడి ప్రయత్నాలు. సహాయ సహకారాలు కొనసాగింపు. ఫలితం సరళ ఇప్పుడు పోస్టు గ్రాడ్యుయేట్. అప్పుడు సరళ కళ్ళలో విరిసిన సంతృప్తిరేఖలు. ఆమె ఇప్పుడు పూర్తిస్థాయి విద్యావంతురాలు. అదే ఆ వెలుగుకు నిర్వచనం.

''సరళా! నీ ముఖంలో సంతృప్తి చూస్తే నా మనసు ఆనందతాండవం చేస్తోంది తెల్సా?'' అన్నాడు చిలిపిగా బుగ్గమీద చిటికేస్తూ.

''నేనింకో విషయం చెబితే మీ మనసేకాదు మీరే ఆనందతాండవం చేస్తారు'' అంది చిరునవ్వుతో.

''ఏంటో అంత నాట్యం చేయించే విషయం'' స్వరూప్.

''మనిద్దరి ఆట కట్టించి, తానాటలాడే చిన్నారి మన మధ్యకు రానుంది'' అంది సరళ. ఆ మాట న్నప్పుడామె బుగ్గలు ఎర్రగా మారాయి.

ఆ మాట విన్న స్వరూప్ కొద్ది క్షణాలు ఏమీ అనలేకపోయాడు. ఆ తర్వాత తేరుకుని ఒక్కసారిగా ఆనందంతో-

''నిజమా...సరళా..'' అని మాత్రం అనగలిగాడు. అంతకుమించి అతడి గొంతు పెగలలేదు. కానీ ఆ రెండు మాటలే వేల అర్థాల్ని స్ఫురింపజేసాయి.

కాలం చకచకా గడిచిపోయింది. సరళ తల్లిగా మారింది. ఇద్దరు బిడ్డల తల్లి అయిన ఆమెకు వారి ఆలనా పాలనతో కాలం తెలియటం లేదు. బిడ్డలను సాకుతోందే కానీ ఏదో తెలియని వెలితి. తన ఇరుగుపొరుగు కుటుంబాలలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులే కావడంతో ఆమె పగలంతా పిల్లలున్నా ఒంటరితనం అనుభవించేది. అదీకాక ఆమె చదివిన చదువుకి సార్థకత లేదనే చింత ఆమెను పట్టి పీడిస్తోంది. అలాటి స్థితిలో వున్న ఆమెకి ఒక రోజు పోస్ట్‌మేన్ ఇచ్చిన కవరు ఎంతో సంతోషాన్నిచ్చింది. ఆమె రెండేళ్ళ క్రితం హాజరైన బ్యాంక్ టెస్ట్‌లో సెలెక్ట్ అయిందనేది ఆ ఉత్తరం సారాంశం.

భర్త రాగానే విస్ఫారిత నేత్రాలతో ఉద్వేగభరిత స్వరంతో ఆమె చెప్పిన విషయం విన్న స్వరూప్ ఆమె ఆనందానికి అడ్డుకట్ట వెయ్యదలుచుకోలేదు. కానీ తప్పలేదు. ఎలా మొదలెట్టారో అర్థం కాలేదు. అతడి అంతర్మథనాన్ని మాత్రం ఆమె ఆనందపారవశ్యంలో పట్టించుకోలేదు. ఆమె ఉద్వేగం తగ్గాక నెమ్మదిగా అన్నాడు.

''సరళా!..నువ్వు ఉద్యోగం చెయ్యడం అంత అవసరమా?'' అని.

భర్త ఏమన్నాడో వినబడినా అర్థం కాలేదు మొదట సరళకి. అర్థమయాక అయోమయంగా చూసిందామె భర్త వైపు. కొద్ది క్షణాలు మాట పెగల్లేదు. సంతోషిస్తాడనుకున్న భర్త నుంచి ఇలాంటి మాట వినబడేసరికి ఏమ్మాట్లాడాలో తెలియలేదు ముందు. తర్వాత తేరుకుని..


''అదేంటండీ?..బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చిందంటే అలాగంటారు!'' కొంత బేలగా అంది. తనకొచ్చిన అవకాశాన్ని ఎవరో బలవంతంగా లాక్కుంటున్న భావన ఆమె మాటల్లో!

''అది కాదు సరళా! మనకిప్పుడేం లోటు? మన సంసారం సజావుగా సాగే జీతం నాకుంది కదా? ఇద్దరూ కష్టపడి సంపాదించి ఏం చెయ్యాలి? అదీకాక పిల్లల్నెవరు చూస్తారు? మనకు వెనకాముందూ ఎవరూ లేరాయె. అలాం

టప్పుడు వాళ్ళ భవిష్యత్ ఏమి కావాలి?'' లాలనగా చెప్పాడు.

''అంటే ఈ కాలంలో కూడా ఆడది వంటింటికే పరిమితం కావాలి. మగాడి చెప్పుచేతల్లో చెప్పు క్రింద తేలుగా వుండాలి. అంతేకదా? అయినా మీరూ మగవారే కదా?'' అంది నిష్ఠూరంగా.

ఆమె మాటల్లో కాఠిన్యత, బాధ, భావం అర్థమయ్యాయి. ఆమె ఆలోచనలు ఏ స్థాయిలో వున్నాయో అర్థమైంది. ఇన్నాళ్ళ తన లాలనా, ప్రేమానురాగాలు అన్నీ మరచిపోయినట్లుంది ఆ క్షణంలో. అది ఆమె తప్పు కాదు. ఆమె మదిలో బలంగా నాటుకున్న ఉద్యోగం చేయాలనే కోరిక తప్పు. ఇంక ఏమీ వాదించదలచుకోలేదు. వాదించినా ప్రయోజనం వుండదు. సంసారంలో కలతలు తప్ప.



తనకి నెలకి పదిహేను వేలు జీతం. పిల్లలు ఎదిగినా ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేని పరిస్థితి. తన వైపు పెద్దలుగాని, ఆమె వైపు పెద్దలుగాని లేరు. ఇప్పుడామె కూడా ఉద్యోగం చేస్తే పిల్లల్ని చూసే దిక్కు లేదు. ఏ రకంగా చూసినా ఆమె ఉద్యోగం చేసే అవసరం కాని, తప్పని పరిస్థితిగానీ లేదు. కానీ ఆమె అవేమీ వినిపించుకునే స్థితిలో లేదు. అయినా ఎన్ని రకాలుగా చెప్పి చూసే అవకాశాలున్నాయో అన్ని రకాలుగా చెప్పి చూసాడు. ఫలితం శూన్యం. దాంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. కానీ మామూలుగా మాత్రం కాదు.

ప్రత్యామ్నాయంగా తనో దృఢ నిర్ణయం తీసుకున్నాడు.

★ ★ ★

''ఏంటండీ మీరు చెబుతున్నది నిజమేనా?'' ఆమె విన్న మాటలు జీర్ణించుకోలేని స్థితిలో ఆశ్చర్యంగా అడిగింది సరళ. ఆమె ఉద్యోగంలో చేరిన ఆనందపుగుర్తులు ఇంకా మాయనే లేదు. ఇంతలోనే భర్త చెప్పిన వార్త. అందుకే ఆమెకంత ఆశ్చర్యం.

''ఔను సరళా! నేను చెబుతున్నది నిజమే. అయినా ఇందులో అబద్ధమో, హాస్యమో ఆడాల్సిన అవసరమేముంది?'' జవాబిచ్చాడు స్వరూప్.

ఆ మాట విన్న సరళ గతుక్కుమంది. అతడన్న మాట నిజం కాకపోతే బాగుండుననే ఆశ అడియాసే అయింది. ఒక్కసారిగా తన ఆశాసౌధం కూలిపోయినట్లయింది. అందుకే మాటలు కూడదీసుకుని అంది నెమ్మదిగా.

''ఎందుకు చేసారండీ ఈ పని? అయినా ఉద్యోగం మానేసి ఏం చేద్దామనుకున్నారు? ఇంత పిచ్చి పనిచెయ్యాలని ఎలా అనిపించింది?'' మనసులో వున్న బాధనంతా వేదన రూపంలో వెళ్ళగక్కుతూ అడిగింది.

''ఎందుకో నీకు తెలియదా సరళా? నువ్వూ ఉద్యోగానికి వెళ్ళిపోయి, నేనూ ఉద్యోగానికి వెళ్ళిపోతే పిల్లలు ఏమైపోతారు? వాళ్ళనెవరు చూస్తారు? అందుకే అన్నీ ఆలోచించే ఈ పనిచేసాను. ఇందులో పిచ్చితనం ఏమీ లేదు'' సాత్వికంగా సమాధానమిచ్చాడు స్వరూప్.

తోకతొక్కిన తాచులా లేచింది సరళ. ''ఔను పిల్లల మీద ప్రేమ మీ ఒక్కరికే వుంది మరి. మీరే కన్నారు వాళ్ళని. అందుకే కన్నపేగు అంతలా విలవిలలాడిపోతూంది. నేను ఆడదాన్నయినా కన్నమమకారం తెలియని దాన్ని. అంతేకదా?'' వ్యంగ్యం, కోపం, పౌరుషం, కసి కలగలిపి ఉన్నాయామె మాటల్లో.

ఏమీ సమాధానం చెప్పకుండా మౌనం వహించాడు. ఆ మౌనంతో ఆమె అహం మరింత దెబ్బతింది. కానీ ఎవరిమీద చూపించాలో తెలియలేదు. అక్కడ్నుంచి విసురుగా వెళ్ళిపోయింది. ఆమె విసురుని చూసి చిన్నగా నవ్వుకున్నాడు స్వరూప్. అతడి భవిష్యత్ ప్రణాళిక మాత్రం అతడి కళ్ళముందు కదలాడింది.

★ ★ ★

'కిడ్స్ ల్యాండ్' అన్న బోర్డు దాటి లోనకెళితే ఆహ్లాదకరమైన ఉద్యానవనం. కల్మషం లేని పిల్లల నవ్వుల్లాగే ప్రతి మొక్కకీ విరిసిన పూలు. పచ్చని మైదానం. దాని మధ్య అందమైన బాటలు.

**అయ్యగారి శ్రీనివాసరావు**

దానిపై పిల్లల రంగు రంగుల సైకిళ్ళ పరుగులు. నవ్వుల కేరింతలు, నడకరాని చిన్నారుల్ని ఎత్తుకుని ఆడించే ఆయాలు. వారందర్నీ దాటి లోన కెళ్ళిన సరళకి పూల మొక్కల మధ్య పిల్లలతో ఆడుతున్న స్వరూప్ కన్పించాడు. కాకపోతే ఆమెకు భర్తలా కాదు ఏ కల్మషం లేని పసిపాపలా. అలా చూసిన స్వరూప్‌ని ఇన్నాళ్ళూ అపార్థం చేసుకున్నందుకు బాధపడింది. కోపంతో అతడితో మాట్లాడటం మానేసిన సరళ దగ్గరకి ఒక రోజు స్వరూప్ వచ్చి-

''సరళా!... నేను పిల్లల కోసం 'క్రచ్' ఏర్పాటు చేస్తున్నాను. జీవితపు పరుగుపందెంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలకు పోతే వారి పిల్లల్ని చూడడానికి ఇది స్థాపించాలనుకుంటున్నాను'' అన్నాడు.

ఆ మాటకి జవాబివ్వలేదు సరళ. కారణం తల్లిగా తను చేయలేని పనిని తాను చేసి చూపిస్తున్నానని ఎద్దేవా చేస్తున్నాడనిపించింది.

ఆమె తన మాటకు జవాబు చెప్పదని తెలిసినా తను ఆమెకు తెలియజెయ్యడం తన బాధ్యతగా తలచి చెప్పాడు. తన పని అక్కడితో అయిపోయింది కాబట్టి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత స్వరూప్ తన ఆశయసాధానికి చకచకా రూపకల్పన చేసాడు. అతడు ఏర్పాటు చేసిన 'క్రచ్' ( బేబీ కేర్ సెంటర్) అతి త్వరలోనే మంచిపేరు పొందింది. అది ఎంతలా పేరు పొందిందింటే...

కుటుంబంలో ఒక్కరే ఉద్యోగం చేస్తున్న వారి పిల్లల్ని కూడా సరదాగా కొన్నిరోజులు అక్కడ చేర్చి ఆ పిల్లలని ఆనందలోకాల్లో విహరింపజేస్తారు తల్లిదండ్రులు. ఫీజు తక్కువ, ఆనందం ఎక్కువ కావడంతో అది అతి కొద్దిరోజుల్లోనే చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ విషయం అందరితోబాటు సరళకీ తెలుస్తోంది. ఆమె ఎదురుగా అందరూ తన భర్తని అతడు చేసిన పనినీ పొగుడుతూంటే తృప్తిగా వుంది. ఆమెకిప్పుడు కోపం స్థానంలో ఆనందం వుంది. తన భర్తని అంతలా పేరొచ్చినట్లు చేసిన ఆ క్రచ్‌ని చూడాలనిపించింది. అందుకే అలా వచ్చిందామె.

''ఏంటి సరళా! ఇలా వచ్చావు'' అన్న మాటలు విన్పించి ఈ లోకంలో కొచ్చింది. ఎదురుగా భర్త స్వరూప్.

ఆమెని అక్కడ చూడడం ఆశ్చర్యమనిపించలేదు స్వరూప్‌కి. తను చేసిన ఈ పనిని ఎప్పటికైనా మెచ్చుకుంటుందని అతడికి తెలుసు. ఆమెతో మాట్లాడుతూ అక్కడే వున్న చెట్టుక్రింద పచ్చికలో కూర్చున్నాడు స్వరూప్ భార్యతోబాటు. అలా కూర్చున్నాక నెమ్మదిగా అంది సరళ.

''ఏమండీ నేను ఉద్యోగం మత్తులో పడి ఎంత తప్పు చేసానో ఇప్పుడు తెలుస్తోందండీ. మీరేగాని ఈ పని చెయ్యకపోతే పిల్లలు ఏమైపోయేవారో'' అంది.

ఆ మాటలన్నప్పుడు ఆమె గొంతు గద్గదికమైంది. ఆ మాట విన్న స్వరూప్..

''ఏమీ అవరు. ఎందుకంటే మన జీవితాల గురించికంటే కూడా వారి జీవితాల గురించి ఎక్కువ ఆలోచించేవాడ్ని కాబట్టి వారికి ఒక మంచి మార్గాన్నే చూపించేవాడ్ని. కాకపోతే అటు పిల్లల్ని మన దగ్గరే వుంచుకున్నట్లవుతుంది. దాంతోబాటు మంచి ఆదాయం కూడా వస్తుంది. అందుకే స్థాపించాను'' అన్నాడు.

''ఏమండీ మీరేమనుకోనంటే ఒక మాట'' అంది అర్థోక్తిలో ఆపుతూ.

''అడుగు సరళా! మొహమాటమెందుకూ?!'' అన్నాడు సౌమ్యంగా.

''ఏమండీ! నేను కూడా ఈ పిల్లల్ని సాకుతూ ఇక్కడే వుండాలని వుందండీ! కానీ ఉద్యోగం వల్ల ఆ అవకాశం లేకపోయిందే అని బాధగా వుందండి'' అంది ఆ మాటలో బాధ స్పష్టమౌతోంది.

అది గమనించిన స్వరూప్ ''అయితే ఒక పని చెయ్యి. నువ్వు కూడా నాలాగే లాంగ్‌లీవ్ పెట్టి ఇక్కడ కొన్నాళ్ళు గడుపు. అప్పుడు రెండు రకాల జీవితాలనీ చూసిన నీకు ఏ జీవితం బాగుందంటే దాన్నెంచుకుని రెండో దాన్ని విడిచిపెట్టవచ్చు'' అన్నాడు నవ్వుతూ.

ఆ మాట విన్న సరళ తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది. అందుకే ఉద్వేగంగా అంది. ''ఏంటండీ మీరనేది. మీరు ఉద్యోగానికి రాజీనామా చేయలేదా?'' అంది ఆశ్చర్యంగా.

''లేదు సరళా. అలా అబద్ధమాడానంతే. ముందు ప్రయోగాత్మకంగా ఈ క్రచ్‌ని స్థాపించి అది నేను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించగలిగితే రిజైన్ చెయ్యవచ్చని లాంగ్ లీవ్ పెట్టాను. ఒక రకంగా సక్సెస్ అయాను.

నీకు దీన్ని నిర్వహించాలనిపిస్తే కొన్నాళ్ళపాటు నేను తప్పుకుని దీన్ని నీకు అప్పగిస్తాను. బాగా నిర్వహించగలిగితే, నీకిష్టమైతే ఇద్దర్లో ఎవరో ఒకరు ఉద్యోగంలోకి వెళ్ళిపోదాం. మరొకరు దీన్ని చూద్దాం. ఏమంటావ్?'' అన్న స్వరూప్ మాటలకు మౌనంగా అర్ధాంగీకారాన్ని తెలియజేసింది సరళ.

✤

## అలరిస్తుందా?

**స్వయంవరం చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని ముగ్ధమనోహరంగా పలకరించిన నంది అవార్డుల విజేత లయ ఇప్పుడు బాలకృష్ణ సరసన కూడా నటించే ఛాన్స్ కొట్టేసింది. టాలీవుడ్‌లో బిగ్‌స్టార్స్‌తో నటించే ఛాన్స్ ఇప్పటివరకూ ఈమెకి లభించలేదు. కేవలం సెలెక్టివ్ చిత్రాలే చేసే లయ ఈమధ్యే వరుసగా చిత్రాల్లో నటిస్తోంది. వంశీ దర్శకత్వంలో వచ్చిన దొంగరాముడు అండ్ పార్టీ అంతగా ఆమెని సంతృప్తి పరచలేదనే చెప్పాలి. ఇప్పుడామె బాలకృష్ణ సరసన నటిస్తూ తన సత్తా ఏమిటో నిరూపించుకోనుంది. కొండా కృష్ణంరాజు రూపొందిస్తున్న ఈ చిత్రంలో సంగీతతో కలిసి నటిస్తోంది. బాలకృష్ణ సినిమాలంటే అటు మాస్‌తో పాటు క్లాస్‌ని ఆకట్టుకుంటాయి. ఈ చిత్రంలో లయ తన గ్లామర్‌తో అందర్నీ అలరించేందుకు సమాయత్తమవుతోంది.**

